DD9 వార్త
తెలుగు దినపత్రిక
బుధవారం, సెప్టెంబర్ 17, 2025



# భద్రాచలంలో టిఎల్ఎం మేళా ఘనంగా ప్రారంభం

- ఉపాధ్యాయుల ప్రతిభకు వేదిక
- విద్యార్థులకు బేసిక్స్ అవగాహనకు తోడ్పాటు
- ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్

7లో





# సైబర్ వల.. చిక్కితే విలవిల

ఆన్‌లైన్, సాంకేతికతను ఆధారంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు పెట్రేగిపోతున్నారు. అమాయకులు, మహిళలు, టెక్నాలజీపై అవగాహన లేని వారిని, డబ్బు అత్యవసరం ఉన్న వారిని టార్గెట్‌గా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. కేవలం నిరక్ష్యరాస్యులే కాదు విద్యావంతులు సైతం ఈ మోసాలకు బలవుతున్నారు. ఇటీవల ఈ సైబర్ మోసాల బారినపడ్డ చాలామంది పోలీస్‌స్టేషన్లలో కేసులు కూడా నమోదు చేశారు. అపరిచిత కాల్స్‌కు స్పందించినా, లింక్స్ క్లిక్ చేసినా మనం వారి ఉచ్చులో పడ్డట్టే. సైబర్ మోసాలు రకరకాలుగా జరుగుతున్నాయి. వయస్సు, వ్యక్తుల విధులను బట్టి కూడా నేరాలు జరుగుతున్నాయి.

- పెట్రేగిపోతున్న ఆన్‌లైన్ మోసగాళ్లు
- టెక్నాలజీని వినియోగించుకొని చీటింగ్
- ఖాతాల నుంచి క్షణాల్లో మాయవుతున్న డబ్బులు
- మరోవైపు లోన్ యాప్‌ల వేధింపులు
- బలవుతున్న సామాన్యులు, అమాయకులు
- అప్రమత్తతే ఆయుధమంటున్న పోలీసులు




2లో

## తెలంగాణ సాయుధ పోరాటం నేటి ప్రజా ఉద్యమాలకు దిక్సూచి

- విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి
- సీపీఐ రాష్ట్ర నాయకులు రావులపల్లి రవి , కల్లూరి వెంకటేశ్వర్లు

6లో





## కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం అవసరం

- కేంద్రానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- రాంమోహన్ నాయుడుతో ఢిల్లీలో భేటీ
- రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించనుంది




## రూ. 11.50 కోట్ల విలువైన భూమని కాపాడిన హైడ్రా

- వెయ్యి గజాల పార్కు స్థలంలో ఆక్రమణల తొలగింపు
- పార్కు స్థలంలో గోడలు, షెడ్ల నిర్మాణం
- ప్రజావాణి ఫిర్యాదుతో వెలుగులోకి
- వెంటనే ఆక్రమణల తొలగింపు

6లో




## అప్రమత్తతే రక్షణ

- డెబిట్, క్రెడిట్ కార్డ్స్, యూపీఐ పిన్, పాస్ వర్డ్ లు, ఓటీపీలు, సీవీవీ నంబర్లను ఏ బ్యాంక్ అధికారి అడగరు. వినియోగదారులు గమనించాలి. బ్యాంకు అధికారులమంటూ వచ్చే ఫోన్ కాల్స్ కు సమాధానం ఇవ్వకపోవడమే మంచిది.
- అపరిచితుల నుంచి వచ్చే ఆఫర్లు, లాటరీలు, డిస్కౌంట్లను నమ్మవద్దు. ఎవరూ ఊరికే మనకూ బహుమతులు ఇవ్వరు. డబ్బులు పంపరు.
- ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్, వాట్సాప్ వేదికగా కొన్ని డేటింగ్ యాప్ ల ద్వారా అందమైన అమ్మాయిలు, మహిళల ఫొటోలతో అకౌంట్లు తెరిచి ఫ్రెండ్ రిక్వెస్టులు, ఫొటోలు పంపుతారు. న్యూడ్ కాల్స్ చేసి వలలో వేసుకుంటారు. అంతా రికార్డు చేసి వేధిస్తారు. బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు గుంజుతారు. ఇలాంటి వాటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.
- ఒక్క క్లిక్ తో లోన్ ఇస్తామని నమ్మిస్తూ పలు యాప్ లు లోన్లు ఇస్తాయి. లోన్ మొత్తానికి అధికంగా కట్టినా.. ఇంకా కట్టాల్సి ఉందని వేధిస్తాయి. ఇలా వేధింపులతో ఎంతో మంది ప్రాణాలు తీసుకున్నారు. అందుకే లోన్ యాప్ లకు దూరంగ ఉండాలి.
- అనుమానాస్పదంగా ఉండే లింక్ లు ఓపెన్ చేయకపోవడమే మంచిది.
- చెక్ బుక్, కేవైసీ పత్రాల కాపీలను అపరిచితులతో పంచుకోవద్దు.

**ఆన్‌లైన్, సాంకేతికతను ఆధారంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు పెట్రేగిపోతున్నారు. అమాయకులు, మహిళలు, టెక్నాలజీపై అవగాహన లేని వారిని, డబ్బు అత్యవసరం ఉన్న వారిని టార్గెట్‌గా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. కేవలం నిరక్ష్యరాస్యులే కాదు విద్యావంతులు సైతం ఈ మోసాలకు బలవుతున్నారు. ఇటీవల ఈ సైబర్ మోసాల బారినపడ్డ చాలామంది పోలీస్‌స్ట ేషన్లలో కేసులు కూడా నమోదు చేశారు. అపరిచిత కాల్స్‌కు స్పందించినా, లింక్స్ క్లిక్ చేసినా మనం వారి ఉచ్చులో పడ్డట్టే. సైబర్ మోసాలు రకరకాలుగా జరుగుతున్నాయి. వయస్సు, వ్యక్తుల విధులను బట్టి కూడా నేరాలు జరుగుతున్నాయి.**

# సైబర్ వల.. చిక్కితే విలవిల

- **పెట్రేగిపోతున్న ఆన్‌లైన్ మోసగాళ్లు**
- **టెక్నాలజీని వినియోగించుకొని చీటింగ్**
- **ఖాతాల నుంచి క్షణాల్లో మాయవుతున్న డబ్బులు**
- **మరోవైపు లోన్ యాప్‌ల వేధింపులు**
- **బలవుతున్న సామాన్యులు, అమాయకులు**
- **అప్రమత్తతే ఆయుధమంటున్న పోలీసులు**

ఒకరు ఫోన్ చేసి ఆధార్ అప్ డేట్ చేయాలి లింక్ పంపిస్తున్నాం అంటూ మన ఖజానా ఖాళీ చేస్తారు. మరొకరు వీడియోకాల్ చేసి అమ్మాయిలతో మాట్లాడించి రికార్డు చేసి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు గుంజుతారు. ఇంకొకరు ఓటీపీ అడిగి ముంచుతారు. ఇలాంటి సైబర్ మోసాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ఈ నేరాలకు సంబంధించి కొన్ని మాత్రమే పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయి. మిగతా వారు పరువు పోతుందనో, చుట్టుపక్కల వారికి చులకన అవుతామనే ఉద్దేశంతో మోసపోయామని తెలిసినా ఎవరి చెప్పకుండా లోలోపల మదనపడేవారు కోకొల్లలు. ఇటీవల లోన్ యాప్ వేధింపులు మరీ ఎక్కువయ్యాయి. పొరపాటున ప్రైవేటు యాప్ నుంచి అప్పు తీసుకుంటే మన జీవితం గుల్ల అయినట్టే. వడ్డీకి వడ్డీ కట్టి అసలు చెల్లించినా ఇంకా కట్టాలంటే లోన్ యాప్ వారు వేధిస్తుంటారు. మరోవైపు మన కాల్ లిస్ట్ లో ఉన్న వారందరికీ ఫోన్ చేసి మన గురించి చెప్పి పరువు తీస్తుంటారు. ఇలా వేధింపులకు గురిచేస్తారు. ఈ బాధలను తట్టుకోలేక పరువు పోయిందనే మనస్తాపంతోనే చాలామంది ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఇటీవల పెరిగిపోయాయి.

### లింక్ క్లిక్.. లక్ష డ్రా...

వెంకటేశ్ (పేరు మార్చాం) ఒక వ్యాపారవేత్త. పెట్రోల్ బంక్ నిర్వహణతోపాటు ఇతర వ్యాపారాలు ఉన్నాయి. తెలివైన, చురుకైన వ్యాపారిగా ఆయనకు గుర్తింపు ఉంది. కొద్దో గొప్పో రాజకీయ పరిచయాలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం వెంకటేశ్ సెల్ ఫోన్ కు ఒక లింక్ వచ్చింది. మీ ఆధార్ కార్డు ఖాతాతో లింకు కాలేదంటూ మెసేజ్ రావడంతోపాటు, లింక్ ను క్లిక్ చేస్తే సరిపోతుందని మెసేజ్ లో పేర్కొన్నారు. మెసేజ్ ను చూసి వెంకటేశ్ లింక్ ను క్లిక్ చేయగానే, అకౌంట్ లో ఉన్న దాదాపు లక్ష రూపాయలు డ్రా అయిపోయాయి. ఈ విషయాన్ని రెండు రోజుల తర్వాత తెలుసుకున్న వెంకటేశ్, పోలీసులను ఆశ్రయించాడు.



### బ్లాక్ మెయిల్

ఆయనో రిటైర్డ్ ఉద్యోగి. గౌరవ ప్రదమైన వృత్తిగా గుర్తింపు పొందిన శాఖలో పనిచేసి, కొద్దిరోజుల క్రితమే ఉద్యోగ విరమణ పొందాడు. ఓ రోజు మధ్యాహ్నం ఓ అపరిచిత సెల్ ఫోన్ నెంబర్ నుంచి వీడియో కాల్ రావడంతో అటెండ్ చేశాడు. ఫోన్ స్క్రీన్ పై ఓ అమ్మాయి కనిపించింది. అంతలోనే ఆ అమ్మాయి దస్తులు తీసేయడం మొదలు పెట్టింది. రిటైర్డ్ ఉద్యోగి తేరుకోక ముందే స్క్రీన్ రికార్డింగ్ అయింది. నిమిషాల వ్యవధిలోనే మరో అపరిచిత సెల్ ఫోన్ నంబర్ నుంచి కాల్ వచ్చింది. 'మీరు అసభ్య కరమైన వీడియోలు చూస్తున్నారు. అమ్మాయిలతో నగ్నంగా చాటింగ్ చేస్తున్నారు. మీరు ఓ అమ్మాయితో జరిపిన వ్యవహారంపై మాకు రికార్డింగ్ వచ్చింది. సైబర్ బ్రాంచ్ లో కేసు నమోదు చేస్తున్నాం' అంటూ బెదిరించడంతో సదరు రిటైర్డ్ ఉద్యోగి ఆందోళనకు గురయ్యాడు. పరువు కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందడం, కొడుకులు, బిడ్డలు గౌరవ ప్రదమైన వృత్తుల్లో ఉండడం, స్క్రీన్ రికార్డింగ్ బయటకు వస్తే పరువు పోతుందన్న బెంగతో ఫోన్ చేసిన వ్యక్తితో బేరసారాలకు దిగాడు. చివరకు పెద్ద మొత్తంలో ఆన్ లైన్ ట్రాంజాక్షన్ లో డబ్బులు చెల్లించాడు. అయితే తాను పూర్తిగా మోసపోయాడన్న విషయం అర్థం అయిన పరువు పోతుందన్న భయంతో పోలీసులకు సైతం చెప్పుకోలేక కుమిలిపోతున్నాడు.

### అన్నీ ఫేకే

ప్రజలను సులువుగా మోసం చేసే సైబర్ నేరగాళ్లను పట్టుకోవడం మాత్రం కష్టతరమే. మోసగాళ్లు చెప్పే పేరు అబద్ధం. వారు వాడే ఫోన్ నంబర్ ఫేక్. ఫోన్ నంబర్ తీసుకునేందుకు మొబైల్ నెట్ వర్క్ కంపెనీలకు ఇచ్చే అడ్రస్, ఇతర ఆధార పత్రాలూ ఫేకే. ఉండేది మహారాష్ట్ర అనుకుంటే.. ఏ ఢిల్లీ, బీహార్ నుంచో ఫోన్ చేస్తారు. వీళ్ల ఫోకస్ అంతా ఇతర రాష్ట్రాల కు చెందిన బ్యాంకు ఖాతాదారులపైనే. అందుకు ఎక్కువగా హిందీనే మాట్లాడుతూ ఫోన్లు చేస్తుంటారు. బ్యాంక్ అధికారులమంటూ వారు చేసే ఫోన్ నంబర్లకు తిరిగి ఫోన్ చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ పనిచేయవు. ఈ నంబర్ ఎక్కడ రిజిస్ట్రేషన్ అవుతుందో. ఏ నెట్ వర్క్ నంబర్ అనే వివరాలు కూడా చాలా మట్టుకు లభించవని, వారు వాడిన మొబైల్ నంబర్లను ట్రేస్ ఏద్దామన్నా ఆనవాళ్లు సైతం దొరకవని పోలీసులు చెబుతున్నారు. ఉత్తర భారత దేశానికి చెందిన రాష్ట్రాల్లోని వారే ముఠాలుగా ఏర్పడి ఇటువంటి నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించినట్లు తెలుపుతున్నారు. సైబర్ నేరగాళ్లు సైతం సామాన్యులు, అమాయకులనే టార్గెట్ చేసి మోసగిస్తున్నట్లు చెబుతున్నారు.






# విద్యార్థి ఉద్యమాలకు ఊపునిచ్చిన బహిరంగ సభ

- **కొత్తగూడెంలో పి.డి.ఎస్.యూ జిల్లా 3వ మహాసభలు**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 16 (డిడి9 వార్త):**

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) జిల్లా 3వ మహాసభలు ఈరోజు కొత్తగూడెం పట్టణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని రైల్వే స్టేషన్ నుండి ఉర్దూఘర్ ఫంక్షన్ హాల్ వరకు విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం హాల్‌లో బహిరంగ సభ జరిగింది. ఈ సభలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నున్న అప్పారావు ముఖ్య వక్తగా మాట్లాడుతూ - “కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ విద్యను నీరుకారుస్తున్నాయి. అందరికీ సమానంగా, ఉచితంగా విద్య అందించాల్సిన బదులు విద్యను వ్యాపార సరుకుగా మార్చి పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా చేస్తున్నారు. విద్యార్థి ఉద్యమ చరిత్రలో కా. జార్జిరెడ్డి వంటి ఎన్నో విద్యార్థి అమర వీరులు తమ ప్రాణాలను అర్పించారు. వారి ఆశయ సాధనకై ఉద్యమాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉంది” అని పిలుపునిచ్చారు. సభలో పి.డి.ఎస్.యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. సాంబ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కొమరం సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కందగట్ల సురేందర్, ఏ.ఐ.కే.ఎం.ఎస్ జిల్లా అధ్యక్షుడు ఉప్పరబోయిన రామ్మూర్తి, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు వీరమల్ల ఉమ, మల్లూరి సుగుణ, పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జే. గణేష్ తదితరులు ప్రసంగించారు. ఈ మహాసభలో జిల్లా నాయకులు డి. అరుణ్, పల్లవి, సందీప్, సంతోష్, రాజేష్, జీవన్, మౌనిక, భరత్, సాయి తదితరులు పాల్గొన్నారు.మహాసభలు రేపటివరకు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.






# శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్న ఎస్పీ

**భద్రాచలం, సెప్టెంబర్ 16 (డిడి 9 వార్త):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కుటుంబ సమేతంగా ఈరోజు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఎస్పీ కుటుంబానికి స్వాగతం పలికారు.

తరువాత స్వామివారి దర్శనమందుకున్న ఎస్పీ దంపతులకు తీర్థప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు. అనంతరం లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు





# వెంకటాపురంలో వైభవంగా ఉట్ల పండుగ

- **పురవీధుల్లో పల్లకి సేవ**

**వెంకటాపురం (నూగురు) సెప్టెంబర్ 16 ( డిడీ 9 వార్త )**

శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం ఉట్ల పండుగ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో ఉట్లు కొట్టే కార్యక్రమం జరిగిన తరహాలోనే, వెంకటాపురంలోనూ పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం స్వామివారికి ఉట్లు కొట్టే భక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ ఉత్సవంలో భాగంగా, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్. ఆర్. ఆర్. అభిలాష్ వర్మ పర్యవేక్షణలో స్వామి వారి పల్లకి సేవ వైభవంగా సాగింది. మంగళవాయిద్యాల మధ్య, కాగడాల వెలుగులో హైస్కూల్ వీధి వరకు సాగిన ఊరేగింపులో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పసుపు, కుంకుమ, కొబ్బరికాయలతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, పవిత్ర జలాలతో స్వాగతం పలికారు.









## వీరభద్రవరం ఆరోగ్య కేంద్రంలో

# వైద్య శిబిరం

**వెంకటపురం (నూగురు), సెప్టెంబర్ 16**

( డిడి 9 వార్త)వెంకటపురం మండల పరిధిలోని వీరభద్రవరం ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అజ్మీర జ్యోతి మొత్తం 89 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. అదేవిధంగా పది మంది మహిళల నుండి రక్త నమూనాలు సేకరించి, పరీక్షల కోసం ములుగు ఏరియా ఆసుపత్రికి పంపించారు.

తరువాత మహిళలకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యాధికారి సూచించారు.








# కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం అవసరం

- **కేంద్రానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి**
- **రాంమోహన్ నాయుడు తో ఢిల్లీలో భేటీ**
- **రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించనుంది.**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 16 (డిడి 9 వార్త):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కేంద్ర పౌర విమానయాన శాఖ సహకారం అందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నాడు ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడు ను కలసి ఈ అంశంపై సవివరంగా చర్చించారు.

రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన సమర్పించగానే ఫీజిబులిటీ సర్వే నిర్వహించినందుకు రాంమోహన్ నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు. మొదట ప్రతిపాదించిన స్థలం అనుకూలంగా లేనందున మరో ప్రదేశాన్ని రాష్ట్రం సూచించిందని, అక్కడ త్వరితగతిన ఫీజిబులిటీ సర్వే పూర్తి చేసి ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కేంద్రం చొరవ చూపాలని ఆయన కోరారు.

భద్రాద్రి రామాలయం దర్శనార్థం దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎయిర్ పోర్ట్ తో సౌకర్యం కలుగుతుందని మంత్రి తుమ్మల వివరించారు. సింగరేణి గనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ, బీపీఎల్ సంస్థలు, అరుదైన ఖనిజ నిక్షేపాలు, అటవీ ప్రాంతం, ఎకో టూరిజం, దేశంలో తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణం వల్ల పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలలో మరింత అభివృద్ధి సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

"తెలుగు బిడ్డెన రాంమోహన్ నాయుడు చొరవతో కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ కల త్వరలోనే సాకారం అవుతుంది. ఈ ప్రాజెక్టుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిస్థాయి సహకారం అందిస్తుంది" అని మంత్రి తుమ్మల తెలిపారు.

ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర భారీ పారిశ్రామిక, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కూడా తుమ్మల కలిశారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, త్వరలో సమావేశం ఏర్పాటు చేసి ఈ అంశంపై ముందడుగు వేస్తామని కుమారస్వామి హామీ ఇచ్చారు.







# విద్యార్థులు చదువుతో పాటు కళలలోనూ రాణించాలి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 16 (డిడీ 9 వార్త):**

జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో విద్యార్థుల ఉత్సాహం ఉరకలెత్తింది. రెండు రోజులపాటు జరిగే జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి.

ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ——

"చిన్నప్పటినుంచి నాకు కూడా కళల పట్ల ఆసక్తి ఉండేది. ముఖ్యంగా సంగీత ఉపాధ్యాయురాలు అంటే ఎంతో ఇష్టం. కానీ పూర్తిగా ఆ దారిలో నడవలేకపోయాను. నేటి పిల్లలు మాత్రం చదువుతో పాటు కళల్లోనూ రాణిస్తేనే భవిష్యత్తు బంగారంగా వెలుగుతుంది. ఇలాంటి పోటీలు మీలోని ప్రతిభను వెలికితీసే వేదికలుగా నిలుస్తాయి" అని సూచించారు.

జిల్లా విద్యాశాఖాధికారి శ్రీమతి బి. నాగలక్ష్మి మాట్లాడుతూ, "ప్రతీ విద్యార్థి ఉత్సాహంగా పాల్గొని తీపి జ్ఞాపకాలను సొంతం చేసుకోవాలి. చదువు మాత్రమే కాదు, ప్రతిభను చాటుకోవడానికి కళ కూడా సమానంగా అవసరం" అని అన్నారు.

**పోటీల విశేషాలు**

జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజు శేఖర్ వివరాల ప్రకారం రెండు రోజులపాటు 200 మంది విద్యార్థులు 12 రకాల కళారూపాలలో పోటీపడనున్నారు.

మొదటి రోజు: శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్ (2D, 3D)

రెండవ రోజు: గాత్ర సంగీతం, వాద్య సంగీతం, కథ చెప్పడం

**మొదటి రోజు విజేతల జాబితా**

థియేటర్ ఆర్ట్స్

నవభారత్ పబ్లిక్ స్కూల్, పాల్వంచ

పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల, పాల్వంచ

విజువల్ ఆర్ట్స్ - 2D

వి. అంశీత, నవభారత్ పబ్లిక్ స్కూల్, పాల్వంచ

ఎన్. నిశిత సాయి, BPL స్కూల్, బూర్గంపహాడ్

**శాస్త్రీయ నృత్యం**

ఎం. ధవళ, త్రివేణి స్కూల్, లక్ష్మీదేవిపల్లి

పి. ఖ్యాతి క్రిపిత, కృష్ణవేణి జూనియర్ కాలేజీ, కొత్తగూడెం

విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి బి. నాగలక్ష్మి బహుమతులు అందజేశారు.









# రామాలయం వద్ద వైభవంగా ఉట్ల పండుగ

**భద్రాచలం సెప్టెంబర్ 16 (డిడీ 9 వార్త)**

కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా, భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం (రామాలయం) వద్ద ఉట్ల పండుగను మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి దామోదరరావు ఉట్టి కట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేడుకలను శ్రీ వైష్ణవ సంప్రదాయ పద్ధతులకు అనుగుణంగా నిర్వహించారు. ఈ ఉత్సవం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని జరిగింది.

సీతాలక్ష్మణ సమేత శ్రీరామ చంద్రమూర్తుని శ్రీకృష్ణ అవతారంలో అలంకరణ చేసి ప్రధాన ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపం వద్ద ప్రత్యేక పల్లకిలో ఆసీనులు చేసి ఉట్ల పండగ కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం పట్టణానికి చెందిన యాదవ కుల పెద్దలు. యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఉట్ల పండుగను నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ఈఓ దామోదర రావు మాట్లాడుతూ, ప్రతి ఏటా కృష్ణాష్టమి ఉత్సవాలను ఘనంగా జరుపుతామని, ఇందులో భాగంగా ఉట్ల పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ ఉట్ల పండుగ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



# భగీరథ పథకం..
# నీరు లేక నరకం

- **చర్ల మండలం సింగసముద్రంలో మిషన్ భగీరథ విఫలం**
- **ఎనిమిదేళ్లుగా మంచినీటి కోసం ఆవేదనలో ప్రజలు**
- **ప్రజా సంపదను వృథా చేసిన అధికారుల నిర్లక్ష్యంపై బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు కొండా కౌశిక్ ఆగ్రహం**

**చర్ల, సెప్టెంబర్ 16 (డిడీ 9 వార్త)**

మిషన్ భగీరథ పేరుతో నిర్మించిన మంచినీటి ట్యాంకులు ఎనిమిదేళ్లుగా ఉపయోగం లేకుండా ఉండిపోవడం, ప్రజలకు తాగునీటి సౌకర్యం అందకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని బహుజన్ సమాజ్ పార్టీ చర్ల మండల అధ్యక్షులు కొండా కౌశిక్ మండిపడ్డారు.

మంగళవారం బహుజన్ సమాజ్ పార్టీ మండల నాయకత్వం సింగసముద్రం గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా కౌశిక్ మాట్లాడుతూ, దాదాపు 100 కుటుంబాలు ఎనిమిదేళ్లుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

ప్రజల కోసం కట్టిన ట్యాంకులను నిరుపయోగంగా వదిలేయడం ప్రజా సంపదను లూటీ చేయడమే. ఇదే సమస్య మీ ఇంట్లో ఉంటే ఇలాగే వదిలేస్తారా?" అని ఆయన ప్రశ్నించారు. ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్నప్పటికీ, దానిని కలుపకపోవడం విచారకరమని అన్నారు.

తక్షణమే చర్యలు తీసుకొని సింగసముద్రం ప్రజలకు మంచినీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాజ్యాంగబద్ధంగా ప్రజానీకాన్ని ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ మండల ఉపాధ్యక్షులు చెన్న మోహన్, కోశాధికారి భాష, బాధిత ప్రజానీకం పాల్గొన్నారు.

# ఆదివాసీలదే ఏజెన్సీ- జేఏసీ

- **ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలి**
- **ఆదివాసి సంఘాల చర్ల జేఏసీ డిమాండ్**

**చర్ల, సెప్టెంబర్ 16(డిడి 9 వార్త)**

చర్ల మండల కేంద్రంలో చర్ల ఆదివాసి జేఏసీ సమక్షంలో తాటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ ఆదివాసి సంఘాల సమన్వయ కమిటీ జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ దొర మాట్లాడుతూ ఈనెల 28 న భద్రాచలంలో జరగబోయే భారీ బహిరంగ సభకు ఆదివాసి యువత, ఆదివాసి ప్రజానికం ఆదివాసి హక్కుల రిజర్వేషన్ ఉద్యమంలో భాగస్వామ్యం అవ్వాలని ఈ బహిరంగ సభలో ప్రతి ఒక్క ఆదివాసి పాల్గొనాలని ఆదివాసి జాతి ఐక్యతను చూపాలని భారత రాజ్యాంగం 5వ షెడ్యూలు ప్రకారం గొండ్వాన భూభాగం లొ రిజర్వేషన్లు ఆదిమా తెగలకు ఎస్టీ రిజర్వేషన్లు మాత్రమే దక్కాలని 1976 లో డిఎన్టి (డినోటిఫై ట్రైబ్) గా విద్య, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్ల లొ చలామణి అవుతూ ఈరోజు ఎస్టీ రిజర్వేషన్ల అవకాశాన్ని మొత్తం కూడా రాజకీయ,ఆర్థిక,విద్య,ఉద్యోగ ఉపాధి రంగాలలో రిజర్వేషన్ను కొల్లగొడుతూ ఆదిమ జాతులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని లంబాడి,సుగాలి, బంజారా సామాజిక వర్గ ప్రజలు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆదివాసి జేఏసీ మండిపడ్డారు ఈ సందర్భంగా తెలంగాణ నాయకపోడు ఆర్గనైజేషన్ సెక్రటరీ పున్నం రామకృష్ణ మాట్లాడుతూ 1976 లో ఎమర్జెన్సీ కాలంలో ఏటువంటి కమిషన్ లేకుండా మరియు రాష్ట్రపతి ఆర్డినెన్స్ లేకుండా దొడ్డి దారిన వీరిని ఎస్టీ జాబితాలో చేర్చారని అన్నారు ఈ సందర్భంగా ఆదివాసి విద్యార్థి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఇర్పా ప్రకాష్ దొర మాట్లాడుతూ లంబాడీలు వివిధ రాష్ట్రాల్లో ఓసి, బిసి, ఎస్సీ గా చలామణి అవుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో డినోటిఫై ట్రైబ్ గా చలామణి అవుతూ ఎస్టీ రిజర్వేషన్లు మొత్తం ఒక సామాజిక వర్గమే లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. రిజర్వేషన్ల ఉద్యమంలో ఆదివాసి యువత ముందు వరుసలో ఉండి హక్కులు రిజర్వేషన్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. భద్రాచలంలో సెప్టెంబర్ 28 న జరిగే ఆదివాసి భారీ బహిరంగ సభకు ఆదివాసి తుడుం దెబ్బ, నాయకపోడు, గొండ్వాన సంక్షేమ పరిషత్ వివిధ ఆదివాసి సంఘాలు, ఆదివాసి ఉద్యమ నాయకులు,సంఘాల బాధ్యులు పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివాసి జాతి ఐక్యతను చాటి చూపాలని చర్ల మండల జేఏసీగా కోరారు ఈ కార్యక్రమంలో చర్ల మండలం మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, జేఏసీ వైస్ చైర్మన్ వాసం ముసలయ్య దొర,జి ఎస్ పి వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, ఆదివాసుల జర్నలిస్టుల ఫోరం కనితి భాను ప్రకాష్, ఆదివాసి హక్కుల పరిరక్షణ వేదిక ఇర్ప రాజు, ఆదివాసి అడ్వకేట్ ఫోరం సీనియర్ న్యాయవాది పర్శిక సోమరాజు దొర, గొంది లీల ప్రసాద్ దొర, మాజీ ఎంపీపీ గొంది ముయ్యన్న, బిరబోయిన శేఖర్, మడకం శేఖర్, పోడియం జగదీష్, కనితి శ్రీను, కనితి జితేంద్ర, మడప భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో జరగనున్న జాతీయ బాలల సమైక్యతా శిబిరం

**కూకట్పల్లి, సెప్టెంబర్ 16(డిడి9 వార్త):**

2025 సంవత్సరంలో జైపూర్‌లో జాతీయ బాలల సమైక్యతా శిబిరం విజయవంతంగా ముగియగా, తదుపరి శిబిరాన్ని తెలంగాణలో నిర్వహించనున్నట్లు జవహర్ బాల్ మంచ్ (జెబిఎం) జాతీయ ఛైర్మన్ శ్రీ జీవీ హరి జీ ప్రకటించారు. జైపూర్‌లో శిబిరం ముగిసిన అనంతరం, తెలంగాణ ఛైర్మన్ శ్రీ మామిడి రిషికేష్ రెడ్డి మరియు రాష్ట్ర సమన్వయ ఇన్‌ఛార్జ్ శ్రీ జిట్టా సునీల్ కుమార్ యాదవ్‌లకు జెండాను అందజేశారు.

ఈ సందర్భంగా పత్రికలతో మాట్లాడుతూ శ్రీ జీవీ హరి జీ, “తదుపరి శిబిరాన్ని తెలంగాణలో నిర్వహించడం మాకు గర్వకారణం. ఇది ఘన విజయాన్నిసాధించేలా అన్ని చర్యలు తీసుకుంటాము” అని అన్నారు. జాతీయ కమిటీ తరపున తెలంగాణ జెబిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ శిబిరం, రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న ప్రజా పాలన, సమైక్య పాఠశాలలు, యంగ్ ఇండియా నైపుణ్యాభివృద్ధి విధానాలను ప్రతిబింబించనుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో ఈ శిబిరం మరింత ప్రభావవంతంగా జరగనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

జవహర్ బాల్ మంచ్ అనేది అఖిల భారత కాంగ్రెస్ కమిటీ యువ విభాగం. ఈ విభాగం ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకోబోతోంది. కాంగ్రెస్ సీనియర్ నేత శ్రీ రాహుల్ గాంధీ ఆలోచనతో ప్రారంభమైన ఈ వేదిక, దేశవ్యాప్తంగా బాలల సమైక్యత, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో విశేష కృషి చేస్తోంది.









# రూ. 11.50 కోట్ల విలువైన భూమని కాపాడిన హైడ్రా

- **వెయ్యి గజాల పార్కు స్థలంలో ఆక్రమణల తొలగింపు**

**హైదరాబాద్, సెప్టెంబరు 16, (డిడి9 వార్త):**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని మాధవా హిల్స్ ఫేజ్ 2లో పార్కు స్థలాన్ని హైడ్రా మంగళవారం కాపాడింది. వెయ్యి గజాల పార్కు స్థలంలో స్థానికంగా ఉన్న వాళ్లు గోడలు కట్టి.. షెడ్డులు వేశారంటూ హైడ్రా ప్రజావాణిలో మాధవాహిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను స్థానిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించి... పార్కు స్థలంగా నిర్ధారించుకున్న హైడ్రా.. వెంటనే ఆక్రమణలను తొలగించింది. ఈ భూమి విలువ దాదాపు రూ.11.50 కోట్లు ఉంటుందని అంచనా. పార్కును కాపాడినట్టు పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది.



# భద్రాచలం గిరిజన గురుకుల కళాశాలలో కొత్త వివాదం

- **పురుగుల అన్నం ఘటనలో సస్పెండ్ అయిన ప్రిన్సిపల్, వార్డెన్ తిరిగి అదే కళాశాలలో పోస్టింగ్.**
- **అనుకూల విచారణపై జేఏసీ నేతల ఆగ్రహం**

**భద్రాచలం, సెప్టెంబర్ 16**

(డిడీ 9 వార్త) గత నెల రోజుల క్రితం భద్రాచలం గిరిజన గురుకుల కళాశాలలో విద్యార్థినీలకు పురుగులున్న అన్నం వడ్డించడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన మళ్లీ వివాదాస్పదమైంది. ఆ ఘటన అనంతరం సస్పెండ్ అయిన ప్రిన్సిపల్, వార్డెన్‌లను తిరిగి అదే కళాశాలలోనే పోస్టింగ్ ఇవ్వడంపై గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జేఏసీ రాష్ట్ర నాయకుడు తెల్లం నరేష్ పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని హరించేంత పెద్ద సంఘటన జరిగి కూడా భద్రాచలం ఐటిడిఏ పీఓ విచారణకు రాకుండా, ఏపీవో డేవిడ్ రాజును విచారణకు పంపడం అన్యాయం అని అన్నారు. ఆయన ఇచ్చిన తప్పుడు నివేదిక ఆధారంగా తప్పుచేసిన వారిని తిరిగి అదే బాధ్యతల వద్ద నియమించడాన్ని ఖండించారు. అంతేకాకుండా, ఈ ఘటనకు సంబంధం లేని ఒక దళిత మహిళా ఫిజికల్ డైరెక్టర్‌ను నిరాధార ఆరోపణలతో ప్రిన్సిపల్, ఆర్‌సిఓ, ఒక రాజకీయ అధ్యాపకుడు కలిసి కుట్ర చేసి బదిలీ చేయించారని ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని చెప్పినందుకే ఆమెను టార్గెట్ చేశారని, ఇది దళిత మహిళపై జరిగిన అన్యాయమని నరేష్ మండిపడ్డారు. భద్రాచలం ఐటిడిఏలో ఏపీవోగా సంవత్సరాలుగా కొనసాగుతున్న గిరిజనేతరుడు డేవిడ్ రాజును



వెంటనే బదిలీ చేయాలని, అతను చేసిన ఏకపక్ష విచారణపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరగాలని, చట్టప్రకారం ఐటిడిఏ ఏపీవో స్థానంలో గిరిజన ఉద్యోగినే నియమించాలని జేఏసీ డిమాండ్ చేసింది. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

# హత్య కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్ష

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం, సెప్టెంబర్ 16 (డిడి 9 వార్త):**

కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న హత్య కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ గౌరవ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి తీర్పు వెల్లడించారు.

2022 అక్టోబర్ 24న రాత్రి 7.50 గంటలకు గణేష్ టెంపుల్ ఏరియాలో బడికల సందీప్ @ బాబీపై, రౌడీషీటర్ పల్లం సాయికుమార్ @ జగడం సాయి కుమార్ (21 ఏళ్లు, గాజుల రాజాం బస్తీ, కొత్తగూడెం) ఉద్దేశపూర్వకంగా దాడి చేసి హత్య చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు.

తదనంతరం విచారణలో తగిన సాక్ష్యాధారాలను సమర్పించిన పోలీస్ అధికారులు, వాదోపవాదాలు విన్న అనంతరం కోర్టు నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించింది. ఈ కేసు దర్యాప్తులో అప్పటి ఇన్స్పెక్టర్ అబ్బయ్య, ప్రస్తుత ఇన్స్పెక్టర్ శివప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వి.డి. లక్ష్మి, కోర్టు లైజెనింగ్ అధికారి వీరబాబు, కోర్ట్ కానిస్టేబుల్ హేమీలాల్ కీలక పాత్ర పోషించారు. వీరందరినీ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు

# తెలంగాణ సాయుధ పోరాటం – నేటి ప్రజా ఉద్యమాలకు దిక్సూచి

- **విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి : సీపీఐ రాష్ట్ర నాయకులు రావులపల్లి రవి**
- **కల్లూరి వెంకటేశ్వర్లు**

**భద్రాచలం, సెప్టెంబర్ 16 (డిడీ 9 వార్త)**

ఆనాటి మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నేటి ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని, ఆ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రావులపల్లి రవికుమార్ పేర్కొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక డివిజన్ పార్టీ కార్యాలయంలో అరుణ పతాకాన్ని రావులపల్లి రవికుమార్ ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జమీందారీ, దోపిడీ, అన్యాయాలపై పేద రైతులు, కూలీలు ఏకమై పోరాడిన మహత్తర ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటమని అన్నారు.

ఈ పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్ వంటి మతతత్వ సంస్థలకు ఎలాంటి పాత్ర లేదని, అయినప్పటికీ కేంద్రంలోని మోడీ సర్కార్ ఈ పోరాట చరిత్రను వక్రీకరించి హైజాక్ చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజా, కార్మిక, రైతాంగ, రైతు కూలీల హక్కుల కోసం నేడు జరుగుతున్న ఉద్యమాలకు సాయుధ పోరాటం దిక్సూచిగా నిలుస్తోందని తెలిపారు.

ఆ పోరాటంలో సుమారు 4,500 మంది అమరులయ్యారని, పదివేల ఎకరాల భూములు పేదలకు పంచబడిన విషయాన్ని గుర్తుచేశారు. పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, అమరవీరుల స్మారక కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సాయుధ పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిగా నిలిచేలా ప్రభుత్వ పథకాలకు నామకరణం చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఐ పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి కంభం మెట్టు శ్రీనివాస్, ఏపూరి వెంకటేశ్వరరావు, ఎస్‌వీఎస్ నాయుడు, గుంజా రామారావు, సీతారామరాజు, చాడ శోభన్, కొక్కిరేణి అశోక్, ఉమాదేవి



కుమారి, నరేష్ నాయుడు, సూరిబాబు, సంతోష్‌కుమార్, కార్తీక్, అజయ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో టిఎల్ఎం మేళా ఘనంగా ప్రారంభం

- **ఉపాధ్యాయుల ప్రతిభకు వేదిక.**
- **విద్యార్థులకు బేసిక్స్ అవగాహనకు తోడ్పాటు - ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ ఐఏఎస్**

**భద్రాచలం, సెప్టెంబర్ 16 (డిడీ 9 వార్త):**

గిరిజన విద్యార్థులు పాఠ్యాంశాలలోని బేసిక్స్ సులభంగా నేర్చుకునేలా, ఉపాధ్యాయుల సృజనాత్మక ప్రతిభను వెలికితీయడానికి టిఎల్ఎం మేళాలు దిక్సూచిగా నిలుస్తాయని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ పేర్కొన్నారు.

మంగళవారం భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో జరిగిన టిఎల్ఎం మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రూపొందించిన తెలుగు, గణితం, ఇంగ్లీష్ పాఠ్యాంశాలకు సంబంధించిన 1,432 సృజనాత్మక బోధనాభ్యాస చిత్రాలను ఆయన పరిశీలించారు. భద్రాచలం, దమ్మపేట, ఇల్లందు డివిజన్‌ల పరిధిలో ఎంపికైన పే సెంటర్, ఏపీఎస్, జిపిఎస్ పాఠశాలల 110 మంది ఉపాధ్యాయులు ఈ మేళాలో పాల్గొన్నారు.

రాహుల్ మాట్లాడుతూ, "ఇలాంటి మేళాలు ఉపాధ్యాయుల ప్రతిభను వెలికితీయడమే కాకుండా విద్యార్థులకూ సులభంగా అర్థమయ్యే పద్ధతిలో బోధన జరిగేలా చేస్తాయి. పోటీ ప్రపంచంలో నిలబడాలంటే విద్యార్థులు బేసిక్స్‌తో పాటు ఆధునిక అంశాలను క్షుణ్ణంగా నేర్చుకోవాల్సిన అవసరం ఉంది" అని తెలిపారు. గతేడాది ఉద్దీపకం వర్క్ బుక్స్ ద్వారా 92 శాతం విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకున్నారని, ఈసారి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రైమరీ స్థాయిలో 25,000 ఉద్దీపకం వర్క్ బుక్ 2 పుస్తకాలు పంపిణీ చేశామని ఆయన వివరించారు.

జిల్లా స్థాయిలో అత్యుత్తమంగా ఎంపికైన ఉపాధ్యాయ బృందాలకు మొదటి బహుమతి రూ.5,000, రెండవ బహుమతి రూ.3,000, మూడవ బహుమతి రూ.2,000తో పాటు మెమెంటోలు అందజేస్తామని రాహుల్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు మణెమ్మ, విజయలక్ష్మి, ఏసీఎంవో రమేష్, రాములు, ఏటిడివోలు అశోక్ కుమార్, చంద్రమోహన్, రాధమ్మ, ఏవో నారాయణరెడ్డి, కృష్ణార్జున, రిటైర్డ్ ఏసీఎంవో రమణయ్య, పాఠశాలల హెచ్ఎంలు, వార్డెన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







## ఏజెన్సీలో మెరుగైన వైద్యం కల్పించాలి

**భద్రాచలం, సెప్టెంబర్ 16 (డీడీ 9 వార్త):**

భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) డిమాండ్ చేసింది. ఈ మేరకు పివైఎల్ నాయకులు భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా పివైఎల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ ముసలి సతీష్ మాట్లాడుతూ... ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని ఆదివాసీ ప్రజలు సరైన వైద్యం అందక తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆసుపత్రుల్లో సరైన మందులు, పరికరాలు, ఆర్థోపెడిక్ స్కానింగ్ వంటి సౌకర్యాలు లేకపోవడంతో నిరుపేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యం చేయించుకునే స్తోమత లేని ప్రజలు లక్షల రూపాయలు వెచ్చించలేక నిరాశ చెందుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల, చర్ల మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, అత్యవసర చికిత్స (ఎమర్జెన్సీ) వార్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చర్ల ప్రాంతం ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండటంతో ఆ రాష్ట్రాల నుండి కూడా గిరిజనులు అత్యవసర పరిస్థితుల్లో చర్ల ఆసుపత్రికి వస్తున్నారని, ఎమర్జెన్సీ వార్డు లేకపోవడం వల్ల మెరుగైన చికిత్స కోసం భద్రాచలం తీసుకెళ్లేలోపే మార్గమధ్యంలో రోగులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలమైన రోడ్ల కారణంగా అంబులెన్స్ ప్రయాణానికి రెండు, మూడు గంటలు పడుతుందని, ఇది పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తుందని వివరించారు. అందువల్ల, చర్ల ఆసుపత్రిలో సిబ్బందిని పెంచడంతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పివైఎల్ కోరింది. అలాగే, ఏజెన్సీలో విష జ్వరాలు ప్రబలకుండా పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేయాలని సూచించారు. భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలోని కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ, వేతన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వారికి యూనిఫాం, చేతి తొడుగులు, మాస్కులు, షూలు వంటివి అందించాలని ఈ సందర్భంగా పివైఎల్ నాయకులు సూపరింటెండెంట్‌ను కోరారు.

## గిరిజన యువతకు జీవనోపాధి దిశగా ఫోటోగ్రఫీ శిక్షణ

- **స్వయం ఉపాధి అవకాశాలను గిరిజన యువత వినియోగించుకోవాలని ఐటిడిఏ పీఓ బి. రాహుల్ పిలుపు**

**భద్రాచలం, సెప్టెంబర్ 16 (డిడీ 9 వార్త):**

గిరిజన యువత ప్రభుత్వ లేదా ప్రైవేటు ఉద్యోగాలకు మాత్రమే కాకుండా స్వయం ఉపాధి, వ్యాపార రంగాలలోనూ రాణించాల్సిన అవసరం ఉందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సూచించారు. మంగళవారం ఐటిడిఏ ప్రాంగణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ (YTC) ను ఆయన సందర్శించారు.

SBI RSETI ఆధ్వర్యంలో నిరుద్యోగ గిరిజన యువతకు అందించబడుతున్న 30 రోజుల ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. శిక్షణ పొందుతున్న యువకులతో మాట్లాడుతూ రాహుల్, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీవనోపాధి పెంపొందించుకోవాలని సూచించారు.

ఫోటోగ్రఫీ శిక్షణ వృథా కాకుండా, మరికొందరికి కూడా తెలియజేసి వారు కూడా నేర్చుకునేలా ప్రోత్సహించాలన్నారు. స్వయం ఉపాధి పట్ల ఆసక్తి చూపే గిరిజన యువతకు ప్రభుత్వం పూర్తి స్థాయి సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ, SBI RSETI కోఆర్డినేటర్ వహీద్ పాషా, స్కిల్ ఫ్యాకల్టీ కిషోర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు






## జోనల్ స్థాయి క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

- **చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమే - ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.**

**భద్రాచలం, సెప్టెంబర్ 16 (డిడీ 9 వార్త):**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకోవాలని భద్రాచలం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థి దశలో క్రీడలు మానసిక, శారీరక వికాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదని, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను కూడా పెంపొందిస్తాయని చెప్పారు. భవిష్యత్తులో విద్య, క్రీడల్లో రాణించి పథకాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు విద్యార్థులతో కలిసి రిబ్బన్ కట్ చేసి, క్రీడల్లో పాల్గొని క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎంఈఓ రామా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం



- **నలుగురికి తీవ్ర గాయాలు**

**వాజేడు, సెప్టెంబర్ 16 (డిడి9 వార్త):**

ములుగు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఏటూరు నాగారం సమీపంలోని జాతీయ రహదారి-163పై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

గాయపడిన వారిలో కన్నాయిగూడెం మండలం లక్ష్మింపురం గ్రామానికి చెందిన యువకులు చిగురు మహేష్, బొమ్మరాజు రాకేష్ ఉన్నారు. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని 108 అంబులెన్స్ సాయంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే వారి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు వారిని వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. వాహనదారుల అజాగ్రత్తే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు.





# గంజాయి బ్యాచ్ ని అరికట్టాలని వినతి పత్రం

- **హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ సీవీ ఆనంద్ గారిని కలిసి డ్రగ్స్ మరియు గంజాయి బ్యాచ్ ని అరికట్టాలని వినతి పత్రం ఇచ్చిన జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఏ.రాజేశ్వర్ యాదవ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు A.రాజేశ్వర్ యాదవ్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ సీవీ ఆనంద్ గారిని కలిసి, నగర ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన ముఖ్యం అంశాలను ప్రస్తావించారు. యువతలో డ్రగ్స్ వాడకం పెరిగి నేరాలకు, ప్రజా అసౌకర్యాలకు దారితీస్తోందని, అలాగే గంజాయి బాచ్ వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బంది అవుతుందని, ప్రజలను కొడుతున్నారని, ఎదురు తిరుగుతే కిడ్నప్ చేస్తున్నారని ,అలాంటి నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుని పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని కోరారు.పాలు, అల్లం-వెల్లుల్లి పేస్ట్, నూనెలలో హానికర రసాయనాలు, జంతు ఎముకలతో కల్తీ నూనెలు చేస్తున్నారని,ఆ నూనెలు వాడటం వలన ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని, ఇరానీ చాయ్ లో ఎముకల పొడి కలుపుతున్నారు,కఠిన తనిఖీలు నిర్వహించి నేరస్తులకు శిక్షలు విధించాలని కోరారు.పొరుగు దేశాల నుండి వలసలు వచ్చి అక్రమంగా స్థిరపడటం వలన భద్రతా సమస్యలు పెరుగుతున్నాయని, దీన్ని అరికట్టేందుకు ప్రత్యేక ధృవీకరణ డ్రైవ్‌లు చేపట్టాలని కోరారు.

అలాగే రాబోయే పండుగల దృష్ట్యా అవగాహన కార్యక్రమాలు, నిరోధక చర్యలు, విజిలెన్స్ డ్రైవ్‌లు చేపట్టి సమాజంలో భద్రత, ఐక్యతను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం ప్రతినిధులు ఎం. కుమార్, రవి చారి, జి. రఘునాథ్ యాదవ్, ధనరాజ్ గౌడ్ పాల్గొన్నారు.




# వరంగల్‌లో కుండపోత వర్షం

**ఉమ్మడి వరంగల్ జిల్లా, డిడి9 వార్త :**

వరంగల్ నగరంలో మంగళవారం రాత్రి కుండపోత వాన కురిసింది. ప్రధాన రహదారులు జలమయంగా మారాయి. చెరువు లను తలపిస్తున్నాయి. వరంగల్, హన్మకొండ, కాజీపేట్ ట్రై సిటీలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయంగా మారాయి. ఇండ్లలో ని నిత్యావసరాలు తడిచి ముద్దయ్యాయి

